# బార్ మేనేజర్

మారేమండ సీతారామయ్య

చెప్పాలి.

చెప్పి తీరాలి.

దాగని విషయం కాబట్టి, దాచుకో దగ్గ విషయం కాదు కాబట్టి, దాచాల్సిన విషయం కాదు కాబట్టి, దాపరికం ఉంచకూడని మనుష్యులు కాబట్టి, ఎప్పటికో అప్పటికి చెప్పాల్సిన విషయం కాబట్టి చెప్పాల్సిందే. అవును చెప్పాలి!

చెప్పేటప్పుడు వెనుకాడ కూడదు. కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాలి. చెవులు చిల్లులు పడేంత గట్టిగా మరీ చెప్పాలి. జంకకుండా చెప్పాలి, అక్షరం పొల్లుపోకుండా. అనుకున్న దనుకున్నట్టు చెప్పాలి. సూటిగా మనసులో మాట చెప్పేయాలి. ఘాటుగా మాటలంటారు. అన్నయ్య తిడతాడు. చదివిన చదువు సారాంశం ఇదా అంటాడు. వద్దని వారిస్తాడు. లాలిస్తాడు. బుజ్జగిస్తాడు. బతిమాలతాడు. తను వినడు. పట్టు వదలడు. చెప్పిన విషయం చేసితీరతా నంటాడు. వెంటనే అన్నయ్య మండిపడతాడు. కళ్ళెర్ర చేస్తాడు. మన వంశంలో చెడబుట్టా నంటాడు. పుట్టి చెడ్డా వంటాడు. చెడి వంశం పేరు ప్రతిష్టలు చెడిపా వంటాడు. కోపంతో జోళ్ళు వేసుకుని టకటకలాడించు కుంటూ కండువా మీదేసుకుని వెళ్ళిపోతాడు. లేకపోతే తన గదిలోకి వెళ్ళి భళ్ళున తలుపు బ్రద్దలయ్యేలా, గడియ విరిగేలా, మడతబందు మేకు వంగేలా, గొళ్ళెం అర గంట



వూగుతూ చప్పుడయ్యేలా, వెయ్యకుండానే చిడతపడేలా తలుపు వేసేసుకుంటాడు.

అత్తిగ తన్ను కోపంగా కళ్ళల్లోకి చూస్తుంది. తను తల దించుకుంటాడు. పొంగి పొరలి ప్రవహించబోయే కన్నీటి ధారను బలవంతంగా పెదవి బిగించి ఆపుతుంది. ఆగకపోతే చీర కొంగుతో ఆనకట్ట వేస్తుంది. విసురుగా వంట గదిలోకి వెళ్ళిపోతుంది. వెళ్ళి గిన్నెలు పగిలేలా చప్పుడు చేస్తుంది. చేసి విసినికర్ర విరిగేలా టపటపా కుంపటి విసిరేస్తుంది. కసిగా చుయ్‌మనేలా పోపంతా చార్లో పోసేస్తుంది.

తను హాల్లో నించుంటాడు. తప్పు చేసిన వాడిలా. బోనులో దోషిలా. దేవుడు ముందు నేరస్థుడిలా. పరీక్ష పేపరు తీసుకోబోయే విద్యార్థిలా. ఒంటరిగా. తోడు లేకుండా. విగ్రహంలా. ఇంకా చాలా చాలాలా.

ఇంతలో నాన్నగారు వస్తారు. "నే విన్నది నిజమేనా?" అని ప్రశ్నిస్తారు.

నిజం కాబట్టి నేను మాట్లాడను. "అప్రాచ్యుడా! తప్పి జారి నా కడుపున పుట్టావు (నిజం కాదు నమ్మకండి. పుట్టింది అమ్మ కడుపున) ఇది నీతి నిజాయితీ వున్న వంశంరా. నువ్వు చేసిన పనేమిటో తెల్సా? తెల్సి చేసిన పనేనా ఇది? అయినా వంశం, కుటుంబం, గౌరవం, పెద్దా, చిన్నా ఏడిశాయా? తాగుబోతు వెధవలతో కల్సితందనాలాడు. నీ ఇష్టం వచ్చిన వాళ్ళతో ఊరేగు" అని తన గదిలోకి వెళ్ళిపోతారు.

గుడి నుంచి అమ్మ వస్తుంది. వస్తూనే ప్రసాదం చేతులో పెడుతుంది. నా మౌనం చూసి వివరం అడుగుతుంది. ఏమీ తెలియని అమ్మకు తను అన్నీ తెల్సేలా చెప్తాడు. అప్పుడు అమ్మ— అవును! అప్పుడు అమ్మ ఏమంటుంది? అమ్మ రియాక్షను ఎలా వుంటుంది? "మద్యపాన నిషేధం రద్దు పరిచినంత మాత్రాన అది మంచి పనవుతుందా? తప్పు నాయనా!" అని అంటుందా? లేక చిన్నప్పుడు చెప్పకుండా, ఎవరు చూడకుండా ఉట్టి మీద పాలు తాగేసేనని కొట్టినట్లు, చెంప పగులగొడుతుందా? చూడాలి. చెప్పిన తరువాత చూడాలి.

తలుపు చాటునుండి చెల్లెలు ఓరగా తన్ను చూస్తుంది. అన్నయ్య కోపం, అత్తిగ విసురుబాటుతనం చూస్తుంది. నాన్నగారి ప్రవర్తన పరిశీలిస్తుంది. అమ్మ ఇచ్చిన ఉపదేశం వింటుంది. విని నా మీద కోపంతో ఏమీ చెయ్యలేక మౌనంగా ఊరుకుంటుంది.

ఏమో! ఎవరు ఏమన్నా, ఏమనుకున్నా, ఏం జరిగినా, ఎంత రాద్ధాంతం జరగబోయినా నేననుకున్నది చెప్పి తీరతాను. చెప్పినది చేసితీరతాను.

అయినా చెయ్యబోయే పనిలో తప్పు ఏమాత్రం లేదు! ఉద్యోగం పురుష

లక్షణం. అందుకే నేనా ఉద్యోగం చేయటానికి సిద్ధ పడ్డాను. అన్నయ్య మాస్టరు గిరీ వెలగబెట్టి సంపాయించే రెండువందల ఏభై రూపాయలకంటే నాకు ఆ ఉద్యోగం వల్ల మరో ఏభై ఎక్కువే వస్తాయి.

బార్‌లో ఉద్యోగం చెయ్యటం తప్పా? అదే దృష్టిలో ఆలోచిస్తే తప్పు కాని దేముంది? అన్నీ తప్పులే. హోటల్సు చేసే పనేమిటి? డబ్బు తీసుకొని అన్నం పెట్టటం కదూ! అంటే అన్నం అమ్ముకోటం. రంగురంగుల అద్దాలలో పెట్టి రకరకాల బూట్లు అమ్ముకునే వాళ్ళ కంపెనీ ఓనరుకు గౌరవం లేదూ? తెలుగులో చెప్పాలంటే షూ బిజినెస్ చెప్పులమ్ముకోటం కదా! ఇంకా జాను తెలుగులో చెప్పాలంటే తోళ్ళమ్ముకోటం. ఐనా అతనికి గౌరవం ఉంది. లక్షలున్నాయి. సేవకులున్నారు. గౌరవప్రదమైన ఉద్యోగాలు చేసే వారికంటే ఎక్కువ గౌరవముంది. 'మంచి చెడ్డా అనేది ఈ ప్రపంచంలోనే లేదు. మనం ఆలోచించే విధానం దేన్నైనా మంచిగా గాని చెడ్డగాగాని రూపొందిస్తుంది.'

ప్లీడరు ప్రకాశం చేసిన ఉద్యోగం ఏమిటి? ఉన్నది లేనిదిగా, లేనిది ఉన్నదిగా మార్చి, న్యాయ నిర్ణేతల కళ్ళల్లో కారం కొట్టి, రంగుల అద్దాలు తగిలించి, తెలుపును నలుపుగా మార్చేసి, వెన్నెలను చీకటి చేసేసి అమాయకులకు ఉరదండలు తగిలించడమేగా? దానివల్ల ప్రకాశంకు జరిగిన అన్యాయమేమిటి? ఏం లేదు. రెండేళ్ళలో రెండంతస్థుల భవంతి కట్టాడు. కట్టిన భవంతులలో కోట్లు కూడ బెట్టాడు. కోట్లతో కొట్టులు కట్టి, కొట్లలో వ్యాపారం చేసాడు. ఎలక్షన్‌లలో నిలబడ్డాడు. నిలబడి నెగ్గాడు. నెగ్గి మునిసిపల్ ఛైర్మన్ అయ్యాడు. అయ్యి లక్ష విలువచేసే టౌను హాలు మూడు లక్షల్లోనే పూర్తి చేసాడు. శంకుస్థాపన చేయించిన ఓవరు బ్రిడ్జి కంట్రాక్టు గడువు మరో మూడేళ్ళకు పెంచాడు. ఎలిమెంటరీ స్కూలు ఎత్తేసి దాని స్థానే చేపల మార్కెట్టు పెట్టాడు. మా పట్టణాన్ని పెద్ద బిజినెస్ సెంటరు చేసాడు. ఇందులో తప్పేం లేదు! ఇదంతా దేశ సేవ! ప్రజాసేవ, పేద ప్రజల సేవ!! సాంఘిక సేవ, సామాజిక సేవ!!! ఆ సేవే నేనూ చేస్తాను. పగలంతా కష్టపడే ప్రజలకు అలసట లేకుండా 'మందు'ను ప్రసాదిస్తాను. చాటుగా 'నాటు' తాగేవారికి నీటైన బాటిల్సు ఓపెన్‌గా యిస్తాను. అయినా బార్‌లో ఖాతాదార్లు ఊరి పెద్దలు. అందువల్ల బార్ మానేజరు ఉద్యోగం గౌరవమైన ఉద్యోగం అవుతుంది.

అదిగో ఇల్లు వచ్చేసింది. తలుపులు తీసే ఉన్నాయి. అన్నయ్య, అత్తిగ, చెల్లాయి హాల్లో సోఫాలో కూర్చొన్నారు. నాన్న

గారు కూడా ఇంట్లో ఉన్నట్టున్నారు. అదుగో అమ్మ కూడా ఉంది. నేను ఊహించినట్లుగా కాకుండా అంతా ఇంట్లోనే ఉన్నారు. ఇదే సమయం. సరిగ్గా ఇదే సమయం. చెప్పేస్తాను. తిడితే అంతా ఒకేసారి తిడతారు. ఏడిస్తే అంతా ఒకేసారి కోరస్‌లో ఏడుస్తారు. పొమ్మంటే ఇంట్లోంచి ఒకేసారి పొమ్మంటారు. ఒప్పుకుంటే అంతా ఒకేసారి ఒప్పుకుంటారు.

అవును! నాకూ సిగ్గు, అభిమానం, నీతి, నిజాయితీ, సహానం, ఓర్పు, వ్యక్తిత్వం అన్నీ ఉన్నాయి. నేనూ మనిషినే. నాకు కూడా గుండెనిండా కోరికలున్నాయి. అవి తీర్చుకునేందుకు ఆలోచనలున్నాయి. పథకాలున్నాయి. ప్రణాళికలున్నాయి. గ్రాడ్యుయేటునై ఎంతకాలం నాన్నగారికి భారమవుతాను? ఒకరి మోచేతి క్రింద పనిచేసి, వారి దయవల్ల పని నేర్చుకోటం నా కిష్టం లేదు. నా వ్యక్తిత్వాన్ని చంపుకుని బ్రతకలేను. స్వతంత్రంగా నా కాళ్ళ మీద నేను బ్రతకాలి. ఏదైనాసరే మానేజరుగా బార్‌లో చేరతాను. ఇంట్లో ఎవ్వరూ ఒప్పుకోకపోయినా, అంతా వ్యతిరేకించినా, ఏడ్చి మొత్తుకుని నన్ను మొత్తినా నే మెత్తబడేదిలేదు.

"ఏరా, ఎక్కడినుంచి రాక? ఆ గోపి గారి దగ్గర అప్రంటిస్‌గా చేరి ఆడిటింగు నేర్చుకోకూడదు? ... అన్నట్టు స్టేటు బ్యాంకులో ఏవో పోస్టులకు అప్లికేషన్సు ఇన్‌వైట్ చేసినట్టున్నారు. అప్లయి చెయ్యకూడదూ?" అన్నయ్య అడుగుతున్నాడు బ్యాంకు ఉద్యోగాల సంగతి తెల్సి, రికమెండేషన్ ఉంటేగాని అప్లికేషను ముఖం చూడరని ఎరిగీ, అట్టమీద అందం బట్టి పుస్తకం ధర కట్టే లోకపు తీరు తెలిసీ!

"లేదన్నయ్యా! నాకు మెరిట్ లేదు. అయినా బార్‌లో నాకు మేనేజరుపోష్టు యిచ్చారు. జాయిన్ అవుతాను." గోడ మీది పటాలను, పటాల్లోని భారతదేశ సమర యోధులను, వారితో ఆడుకునే పురుగుల్ని చూస్తూ అన్నాను.

"బార్‌లోనా? అంటే సారాయి బడ్డీలోనా??" తన దగ్గరున్న ఆశ్చర్యమంతా తన ప్రశ్నలలో గుమ్మరించి అన్నయ్య అడిగాడు.


"............"

"ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?" నేను ఊహించినంత సినిమా సీను కోపంతో అడగలేదు అన్నయ్య.

"చాలాసేపు ఆలోచించే ఈ నిశ్చయానికి వచ్చాను." ఎలా గొచ్చిందో నా గొంతుకులోంచి జవాబు వచ్చింది.

"ఊఁ. నిర్ణయం చేసుకున్న తరువాత ఏముందిలే. ఒకరిదగ్గర పని నేర్చుకోటం నామోషి అనుకున్నవాడికి, వ్యక్తిత్వానికై పాటుబడి సర్వస్వతంత్రుడు కావాలనుకున్నవాడికి సరియైన ఉద్యోగం

నాతప్పేమీలేదు. మీరు తలవంచకుండా ఉంటే అద్దం బద్దలయ్యేదే కాదు మరి_




బార్ మేనేజరేమో! నాన్నగారు లోపలున్నారు. ఈ వార్త ఆయన చెవిలో కూడా వేస్తే బావుంటుంది."

నాన్నగారు ఎప్పుడొచ్చి గుమ్మంలో నిల్చొన్నారో నాకు తెలియదుగాని నేను చెప్పకుండానే ఆయనకు ఈ విషయం తెల్సిందని ఆయన ముఖం చూడగానే తెల్సింది.

వెంటనే ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటారనుకున్నాను.

కాని అలా జరగలేదు.

"రామూ! నీకు గుర్తుందనుకుంటాను. ఏడాది క్రిందట మా స్టూడెంట్స్ కొందరు కల్లు పాకలపై దాడిచేసి నాటు సారాయి వర్తకుల్ని కొందర్ని పట్టుకుని కేసు పెట్టించి, ఫైల్ చేయించి, ఫైను వేయించారు. ఆ రోజు దాడిలో నువ్వు ఒక విధంగా వారికి నాయకుడివి. నువ్వు ఏ నోటితో మద్యపానం మహాపాపం అని చెప్పావో అదే నోటితో నేడు ఒప్పుని, అది విక్రయించటానికి సిద్ధపడ్డావు. నీది నీతులు చెప్పించుకునే వయసు కాదు, మరొకరికి నీతులు చెప్పాల్సిన వయస్సు. నీ అంతటి వాడివి నువ్వయ్యావు. ఆపై నీ ఇష్టం."

నాన్నగారు ఇంత తేలిగ్గా తన అంగీ

కారం తెలుపుతారని నేను కలలోకూడా అనుకోలేదు. ఊహించలేదు!

మద్యపానం ఒకనాడు తప్పు. కాని ప్రభుత్వానికి ఆదాయం దానివల్ల పెరుగుతుంది కాబట్టి, నిషేధాన్ని రద్దు పరచారు. ఒకనాడు సముద్రయానం భారతీయ సంస్కృతి, ఆచారాలకు విరుద్ధం. నేడుఫారెన్ రిటరండ్సుకు అపరిమితమైన గౌరవం లభిస్తోంది. పదిహేనేళ్ళ క్రిందట బర్త్ కంట్రోలు నేరం. శిక్షకు అతీతమైన ఘోరమైన నేరం. హత్యతో సమానం. కాని ఈరోజు ప్రతి డాక్టరు చేసేపనే అది. జనాభా పరిమితికై రేడియోలలో, పేపర్లలో, పత్రికలలో ప్రభుత్వం బర్త్ కంట్రోల్‌ను ప్రోత్సహించి విశేషప్రచారం చేస్తోంది. ఒకనాటి తప్పు కొంతకాలానికి ఒప్పుగా, మరి కొంతకాలానికి గొప్పగా పరిగణింప బడవచ్చు!

ఇంట్లో ఎవరికీ నా ఉద్యోగం నచ్చలేదని తెల్సీ పై విధంగా తలచి నా మనస్సును సమాధాన పరుచుకోగలిగాను.

* * *

“శాస్త్రిగారి రెండవ అబ్బాయి బార్‌లో మేనేజరుచేస్తున్నాట్ట. బి.కాం.పాసై బాటిల్స్ అమ్ముకుంటున్నాడు. వారిది మచ్చలేని వంశం. వేలెత్తి చూపించుకోని కుటుంబం. అందులో పొరపాటుగా పుట్టాడు. ఓ చీడపురుగు వల్ల వంశవృక్షం సర్వనాశనం అవుతోంది.” నాముఖం ముందు మాటాడలేని లోకులు నాకు వినిపించేలా నా వెనకాల ధైర్యంగా నన్ను విమర్శించటం మొదలు పెట్టారు.

“కూటికోసం కోటి విద్యలు. మనిషి బట్టి వుద్యోగానికి గౌరవం రావాలిగాని, ఉద్యోగంబట్టి మనిషికి గౌరవం రాకూడదు. అలా జరిగిననాడు వ్యక్తిత్వానికి విలువేది? మారిన కాలంతోపాటు మనుషులు, మనస్తత్వాలు మారాలి” అని నన్ను మెచ్చుకునే వారు స్వల్ప సంఖ్యలో లేకపోలేదు.

కాని యింతకంటే విచిత్రమైన విషయం ఏమిటంటే నేను ఏదో క్షమించరాని నేరం చేసినట్టు, నేను చేసిన నేరానికి మా నాన్నగారు, అన్నయ్య శిక్ష అనుభవించి, పశ్చాత్తాపపడి కుమిలిపోతున్నట్టు కొందరు సానుభూతి ప్రకటించడం మొదలుపెట్టారు.

“మరే! ఈ మధ్యే తెలిసింది. పాపం మీవాడు బార్‌లో మేనేజర్ గా చేరాట్ట కదూ! ఆ మధ్య గోపిగారి దగ్గరకు పంపి ఆడిటింగ్ నేర్పిస్తానన్నారుగా? ఆయినా ఈ కాలం కుర్రాళ్ళు అదుపు ఆజ్ఞలలో వుంటారా? మనం చెప్పినట్టు వింటారా!”

మరికొందరు, “మీ వాడు మీ ఇంట్లోనే వుంటున్నాడా? లేక వేరే— అహఁ సంగతి తెలుసుకుందామని... అయినా మీ కిష్టంలేని పని చేస్తాడా మీ వాడు! ఎటువంటి వంశం మీది.

తండ్రిమాట జవదాటని వంశం కదూ!" అనటం.

ఇలా రకరకాలుగా చిలవలు పలవలుగా నా గురించి పదిమంది పది రకాలుగా అనుకోవటం మొదలు పెట్టారు.

కళ్ళు లేని సంఘాన్ని, నిజాన్ని చూడలేక చెవులతో విని నాలుకతో నాలుగు రకాలుగా పేలే లోకుల్ని, పరిస్థితి అర్థం చేసుకోలేని బంధువుల్ని లక్ష్య పెట్టేవారు జీవిత పథంలో ముందుకు సాగలేరు.

ఐతే బయట పరిస్థితికంటే యింట్లో పరిస్థితి సహించలేనిదిగా తయారైంది. నేను బార్‌లో ఉద్యోగం చెయ్యటం ఎవరికీ యిష్టంలేదు. కాని వేన్నీళ్ళకు తోడయిన చన్నీళ్ళని కాదని నన్ను పోషించే ఓపిక ఎవరికీలేదు. పోషింపబడటం నా కిష్టంలేదు. నిజం ఆలోచిస్తే నా సంపాదనే వేన్నీళ్ళు.

ఈ పేరడాక్స్ వల్ల ఏర్పడిన విచిత్ర పరిస్థితి నాపై మానసికంగా పనిచేసింది.

ఉద్యోగం, సద్యోగం లేని రోజుల్లో రాత్రి తొమ్మిది గంటలవరకూ మిత్రులతో బాతాఖానీకొట్టి యింటికి చేరినా నా గుంచి మేలుకొని దగ్గర కూచొని ఆప్యాయతతో వడ్డించి కొసరికొసరి తినిపించే అమ్మ ఈనాడు, అన్ని అమర్చి మూతలుపెట్టి వంటిల్లు తాళంవేసి, తాళం నా గదిలో పెడుతోంది.

రాబోయే తన రెండవ అత్తగా అందచందాలు, గుణగణాలు వర్ణించి, పొగిడి నన్ను నవ్వించి అనుక్షణం అంటిపెట్టుకొని తిరిగే చెల్లి నన్ను తప్పుకు తిరుగుతోంది. ప్రతి సాయంత్రం ఊరి చివర కాలవ ఒడ్డుకు షికారు వెళ్ళినప్పుడు పారే సెలయేరులా గలగలా మాట్లాడేది. కాని ఈనాడు నేను సంభాషిస్తే నేరంగా భావిస్తోంది.

తల్లిని మించిన అప్యాయత, అనురాగం కురిపించి, నన్ను అనుక్షణం కన్న బిడ్డలా చూసుకునే అత్తగా ముభావంగా అంటీ అంటనట్టు, నా నీడ సోకితే పాపమన్నట్టు మసులుతోంది.

పది రోజుల క్రిందట యాత్రలకు వెళ్ళిన నాన్నగారు తన ఉత్తరంలో పేరు పేరునా, మనిషి మనిషిని పలకరించి నన్ను పరిహరించటం నే నంత పట్టించుకోలేని విషయం ఎంత ప్రయత్నించినా కాలేకపోయింది.

నా రెండో నెల జీతంలో యింట్లో అందరికీ బట్టలు కొన్నాను. చెల్లెలకు గులాబిరంగు చీర కొన్నాను. ఆ చీరకు నల్లని గుర్రాలు వరుస బార్డరు. ఆ రోజు అన్నయ్యమాటలు నా గుండెల్లో నిద్రపోయిన అవమాన అగ్నిపర్వతాల్ని తట్టి లేపి మండిగాకొట్టి, మాడి మసయ్యేలా నా హృదయాన్ని తాకాయి. భౌతికంగా మనిషికి చావు ఒకసారే. కాని మానసికంగా మనిషిని ఎన్నోసార్లు చంపి, బ్రతికించి, అరుణరుధిరం వెల్లువలై ప్రవ

హించేలా నిలువునా ఖూనీచేయగల శక్తి ఒక్క-మాటలకే ఉందేమో!

ఎక్కడ చూసినా మౌనం. భరించలేని నిశ్శబ్దం. మూగతనం. ముభావం. ఒంటరితనం!

గుండెల్లో శార్దూల విక్రీడితం!!

మెంటల్ టార్చర్!!!

ఎందువల్ల?

ఎవరికీ ఇష్టంలేని ఉద్యోగం, అందరినీ కాదని చేస్తున్నందువల్ల!

నేను లోకానికి జడవటంలేదు. సంఘం కూసే పనికిమాలిన కూతలకు విలువనివ్వటంలేదు. గాంధీగారిపై ప్రగాఢమైన భక్తి, గౌరవం, ఆయన సిద్ధాంతాలపై నిండైన నమ్మకం గురి నాకు లేవు. బార్‌లో ఉద్యోగం చెయ్యటం నేరంకాదని నేను యిప్పటికీ వాదిస్తాను. అది తప్పుకాదనే నా వ్యక్తిగత అభిప్రాయాన్ని నేను మార్చుకోలేను. మద్యపాన నిషేధం రద్దు దేశ గౌరవానికి గొడ్డలిపెట్టు అని ఉపన్యాసం యివ్వను. ఒకే యింట్లో రెండు కుంపట్లు పెట్టే దేశం ఏమైనా నేనంత పట్టించుకోను! కాని నాకు కావలసింది ఆప్యాయత, అనురాగం, అభిమానం, మమత, ప్రేమ, మానవునికి యిచ్చే కనీసపు గౌరవం.

అవి మనిషి మనుగడకు ముఖ్యమైనవి.

అవి లోపించిన జీవితం ఎడారిలో ఎఱ్ఱగులాబి లాంటిది.

నాకు కావలసింది డబ్బు మాత్రమే కాదు.

అమ్మ ఆప్యాయత, అన్నయ్య అనురాగం, చెల్లెలు అభిమానం, అత్తగారి సహకారం, నాన్నగారి ఆశీర్వాదం నాకు కావాలి. నా వాళ్ళు నన్ను నోరారా పలకరించాలి. నన్ను వాళ్ళల్లో ఒకడిగా చూసుకోవాలి.

వెలివేసి లోకంకోసం తమతోనే కలగలుపుగా బ్రతుకుతున్నట్టు నటించమని శిక్షించన నేరంకు ప్రాయశ్చిత్తం కావాలి. వెలివేయబడి నా చుట్టూ నిర్మింపబడ్డ మూగ చెరనుండి నేను విడుదల అవ్వాలి.

సర్పబంధంలా ఉన్న ఈ మౌనం నుంచి విముక్తుడ్నవ్వాలి.

నా చుట్టూ పరిధి గీసి తయారు చేసిన ముభావవలయం నుండి నాకు మోక్షం లభించాలి.

అందుకే నెలనెలా మూడొందలు ఆర్జించిపెట్టే బార్ మేనేజరు పోస్టుకు రాజీనామా ఇచ్చి నెలకు నూటయాభై ఇచ్చే గోపిగారి దగ్గర అప్రంటిస్‌గా చేరాను.

ఐతే యిలా చేయటంవల్ల ఏ వ్యక్తిత్వాన్ని నేను నిలబెట్టుకోవాలని బార్‌లో చేరానో అదే వ్యక్తిత్వాన్ని అప్రంటిస్‌గా చేరి కుదువబెట్టానని నాకు తెల్సు.

ఇది అర్థంలేని త్యాగమే అవ్వచ్చు.

అయినా ఇందులో తృప్తి ఉంది.

మానసికంగా అనంతమైన ఆనందం ఉంది. *